


# కరపత్రం

SINCE 2014

ఆదివారం మే 24, 2026 సంపుటి : 2 సంచిక : 222 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4



## యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

» వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

» రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ

**యాదగిరిగుట్ట,మే23 :**
యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

## హరీష్ రావువి పగటి కలలు

- అధికారంలోకి రావడం కల్ల
- ఫ్యూచర్ సిటీపై బాధ్యతారాహిత్య ప్రకటన
- అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్
- మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,మే24 :**
ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు.

2లో..



## సెంట్రింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు

- వారి సమస్యలు పరిష్కరించాలన్న కవిత

**హైదరాబాద్,మే23 :**
సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సెంట్రింగ్ కార్మికులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు.

2 లో



## తెలంగాణ పాలిసెట్ ఫలితాలు వచ్చేశాయ్..

**హైదరాబాద్:**
తెలంగాణ డిప్లొమా ఇన్ ఇంజినీరింగ్ (పాలిటెక్నిక్) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ 2026 ఫలితాలు విడుదలయ్యాయి. మొత్తం 82.94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బాలురు 79.92 శాతం, బాలికలు 86.38 శాతం ఉత్తీర్ణత సాధించారు. నామాల లోకేశ్ (వరంగల్) ఫస్ట్ ర్యాంక్ సాధించగా.. బోనోతు హేమనాథ్ (సూర్యాపేట) రెండో ర్యాంక్ సాధించాడు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి ఫలితాలను, ర్యాంక్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు..

» ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు

» హరీష్ వ్యాఖ్యలపై పొంగులేటి కౌంటర్



2లో..

**హైదరాబాద్,మే23 :**
బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. లాగే మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నారా..? అంటూ నిలదీశారు.

## తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

- వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు
- మృతుల కుటుంబాలకు 4లక్షల చొప్పున పరిహారం
- పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటీ సమీక్ష



**హైదరాబాద్,మే23 :**
రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ప్రజల ప్రాణ రక్షణెళి తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు.

మిగతాద్ది 2 లో

## దేశంలోనే తొలి ఏఐ ఆధారిత ఫిర్యాదు రికార్డర్ ..

### ఆవిష్కరించిన సీపీ సజ్జనార్



**హైదరాబాద్:**
దేశంలోనే తొలి ఏఐ ఆధారిత ఫిర్యాదు రికార్డర్ 'ఏఐ కాప్‌రైటర్' యాప్‌ను హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆవిష్కరించారు. దీని ద్వారా 10కిపైగా భాషల్లో ఫిర్యాదులు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. చెప్పిన విషయాలను వెంటనే టెక్స్ట్‌గా మార్చి అనువదించవచ్చని చెప్పారు. ఫిర్యాదు వివరాలు ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో సేవ్ అయ్యే సదుపాయం ఉందన్నారు. వలస కార్మికులు, పర్యాటకులు, మహిళలు, వృద్ధులకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్పారు. భాష న్యాయానికి అడ్డంకి కాకూడదన్న లక్ష్యంతో ఏఐ వినియోగిస్తున్నట్టు తెలిపారు. తొలుత హైదరాబాద్ పరిధిలోని 80కి పైగా పోలీస్‌స్టేషన్లలో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఎఫ్ఐఆర్ ప్రక్రియను వేగంగా, కచ్చితత్వంతో పూర్తి చేసేందుకు ఈ యాప్ దోహదపడుతుందని సజ్జనార్ పేర్కొన్నారు. బ్లూక్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ సహకారంతో యాప్ రూపకల్పన చేసినట్టు చెప్పారు.

## ధాన్యం కొనుగోళ్లలో పూర్తి నిర్లక్ష్యం

» రైతుల అగచాట్లు పట్టని ప్రభుత్వం: వేముల



2లో..

**నిజామాబాద్,మే23 :**
పంట కొనుగోలులో దారుణంగా విఫలమైన ప్రభుత్వం అన్నదాతల ఆత్మహత్యలపై తప్పుడు లెక్కలు చెప్తున్నదని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి మండిపడ్డారు. ధాన్యం ఎక్కడా సక్రమంగా కొనగడం లేదన్నారు. నిజామాబాద్‌కు వస్తే రైతులు పడుతున్న అగచాట్లను చూపిస్తానని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో చనిపోయిన రైతులు పది మందిపైనే ఉన్నారని, కానీ ఒక్కరూ చనిపోలేదని మంత్రి అనడం సిగ్గుచేటని నిప్పులు చెరిగారు.

## పర్సంటేజీ అయితనే సినిమా ఆడుద్ది

- పెద్ది సినిమా నుంచే మొదలు పెడదాం
- రెంటల్ సిస్టమ్ కాలం చెల్లిన విధానం
- తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్



**హైదరాబాద్,మే24 :**
తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ది సినిమా విడుదల చేయాలంటే తమకు పర్సెంటేజ్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమా అయినా పర్సంటేజ్ కావాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తేల్చి చెప్పింది. శనివారం తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు, మూడు సార్లు చర్చలు జరిగాయి.

మిగతాద్ది 2 లో

## యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

» దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు

» ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు

» 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



2 లో

**హైదరాబాద్,మే24 :**
దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం మే 24, 2026

# బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు..

మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్ కూడా ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం ఫాంహౌస్‌లు కట్టుకుందని.. కానీ తాము రాష్ట్ర భవిష్యత్తు కోసం ఫ్యూచర్ సిటీ కడుతున్నామని ఉద్ఘాటించారు. మూసీప్రక్షాళన, లగచర్ల ఇండస్ట్రీస్‌కు బీఆర్ఎస్ నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహించారు. యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నాలను కుట్రలతో అడ్డుకున్నారన్ని ÷ర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం గర్వించే విధంగా తాము ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తు ఖతం చేయాలని బీఆర్ఎస్ నేతలే చూస్తున్నారని సెటైర్లు గుప్పించారు.

## సెంట్రింగ్ కార్మకుల సమ్మెకు మద్దతు

మొదటి పేజీ తరువాయి

శనివారం ఇందిరాపార్క్ వద్ద జరుగుతున్న గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ గుత్తేదారుల అసోసియేషన్ మహాధర్నాకు కవిత మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రెండు రోజుల్లో సెంట్రింగ్ కార్మికుల నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించాలని కవిత డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల తర్వాత తానే స్వయంగా ధర్నాలో కూర్చుంటానని స్పష్టం చేశారు. సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లు గొంతెమ్మ కోరికలు కావని.. న్యాయమైనవేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే కచ్చితంగా విద్య, వైద్యం అందిస్తామని కవిత స్పష్టం చేశారు.

## ధాన్యం కొనుగోళ్లలో పూర్తి నిర్లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

'పంటలు కొనక పోవడంతో గగ్గోలు పెడుతూ రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతులు ప్రాణాలు కోల్పోయినా నిస్సిగ్గుగా అబద్దాలు చెప్తున్నారని విరుచుకుపడ్డారు. అవసరమైతే ప్రభుత్వానికి రైతుల మరణాల వివరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. మండుటెండల్లో రైతులు పంటలు అమ్ము కొనేందుకు పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాల్లోవివరాలు సేకరించాకనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నానని స్పష్టంచేశారు. పంట కొనుగోలు సంక్షోభం, అన్నదాతలు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులను తెలుసుకుని మాట్లాడాలన్నారు. పంట కొనుగోలు సంక్షోభంపై చర్చించాలని, చర్యలకు ఆదేశించాలని అన్నారు.

## తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

మొదటి పేజీ తరువాయి

వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు. ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తులకు ఆయా ఆస్పత్రులు అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే తెలంగాణలో భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండగా, 18కు పైగా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో అధికారులు 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లోనూ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి 43 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాలు తీవ్ర వడగాలుల ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ ప్రభావం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అధిక ఉష్ణోగ్రతల కారణంగా అలసటగా ఉంటుంది, గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వేడిగా ఉన్నప్పుడు ఎక్కువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. కండరాల నొప్పి ఉంటుంది. హీట్ ఇంజురీలో శరీర భాగాలు దెబ్బతినే అవకాశం ఉంది. కిడ్నీ, గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హీట్ స్ట్రోక్ తీవ్రమైన సమస్య.. దీనిలో శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా మెదడు పనితీరు దెబ్బతింటుంది. స్ట్రోక్ సంభవించవచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ వడదెబ్బ నుంచి తప్పించుకోవాలంటే.. శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లకపోవడం మంచిది. షుగర్, బీపీ పేషెంట్లు మెడికేషన్ సక్రమంగా తీసుకోవాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు బయట తిరగకపోవడమే మంచిది. అత్యవసర పరిస్థితిలో వెళ్లాల్సి వస్తే.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముదురు రంగు దుస్తులు కాకుండా తేలికపాటి లేత రంగు దుస్తులను ధరించాలి. ఆల్కాహాల్ శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తాయి. ఎండాకాలంలో మద్యానికి దూరంగా ఉండటం మంచిది. ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన నిమ్మరసం లాంటివి శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి భర్తీ చేస్తాయి. దోసకాయలు, పుచ్చకాయలు, దానిమ్మ, బత్తాయి లాంటి పండ్లు తీసుకోవాలి. వేసవిలో తేలికపాటి వ్యాయామాలు ఉదయం 8 గంటల్లోపే ముగించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపించగానే చికిత్స అందించాలి. లేదంటే శరీరం పూర్తిగా నిర్జలీకరణం చెంది.. బీపీ, పల్స్ పడిపోయి కొన్నిసార్లు ప్రాణాలు పోవచ్చు.

## యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

మొదటి పేజీ తరువాయి

2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్లు వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ఏఐ, ఎని వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు.భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం-శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచనలు చేశారు.

## వైఎస్ కుటుంబానిది రక్త చరిత్ర

# ఫ్యాక్షన్ రాజకీయాలు వారితోనే మొదలు

**- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి పయ్యావుల కేశవ్**

ఫ్యాక్షన్ రాజకీయాలకు బీజం వేసింది వైఎస్ కుటుంబం అయితే... జగన్ దాన్ని కొనసాగిస్తున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఈ మేరకు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి పయ్యావులతీవ్రంగా విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పులివెందులలో వైఎస్ రాజారెడ్డి అకృత్యాలను వివరించారు. జగన్ అరాచక రాజకీయాలపై యువత ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జగన్ బాధితుడు కాదని.. నిందితుడంటూ వ్యాఖ్యానించారు. జగన్ బెంగళూరు నుంచి వచ్చినప్పుడల్లా కొత్త వాదన తెస్తారన్నారు. వివేకా హత్య కేసులో ఏం జరిగిందో నిక్కరు వేసుకున్న కుర్రాడు కూడా చెబుతాడని.. అలాంటి వాటిల్లో కూడా జగన్ అసత్యాలు చెబుతున్నారని అంటూ దుయ్యబట్టారు. వైఎస్ కుటుంబంతోనే రాజకీయాలు నేరమయ్యాయని.. రాజకీయాల్లోకి ఫ్యాక్షన్ తెచ్చారని మంత్రి మండిపడ్డారు. 1989లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీమలో ఫ్యాక్షనిజానికి అండగా నిలిచిందని ఆరోపించారు. నాటి ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో పార్నపల్లి అనే గ్రామంలో టీడీపీకి భారీ మెజార్టీ వచ్చిందని.. ఆ గ్రామానికి చెందిన టీడీపీ నేతల ఇళ్లకు డ్రిల్ చేసి డైనమేట్లు పెట్టి పేల్చారని.. ఇదీ రాజారెడ్డి చరిత్ర అని చెప్పుకొచ్చారు. ఓ ఇంటిని డైనమేట్లు పెట్టి పేల్చేసిన ఘటనను ఇప్పటికీ ఎవ్వరూ మరిచిపోలేదన్నారు. తన ప్రత్యర్థుల మీద దాడి చేయించి... అదే సందర్భంలో వేరే చోట ఉన్నట్టు సృష్టించుకోవడం అనేది వైఎస్ కుటుంబంతోనే మొదలైందని అన్నారు.

కడప జిల్లాలోని లింగాల మండలంలో ముగ్గురు టాప్ లీడర్లను భయపెట్టి లొంగదీసుకున్నారని పయ్యావుల ఆరోపించారు. ఇలాంటివి పదుల సంఖ్యలో పులివెందులలో జరిగాయన్నారు. రాజారెడ్డి నుంచి మొదలుకుని పులివెందులలో జరిగిన ఘటనలపై పుస్తకం వేస్తామన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక సీమలో ఫ్యాక్షన్ కంట్రోల్లోకి వచ్చిందన్నారు. వైఎస్ కుటుంబం మొదలు పెట్టిన ఫ్యాక్షన్ రాజకీయాలను కంట్రోల్ చేయడానికి 30 ఏళ్లు పట్టిందని తెలిపారు. రప్పా రప్పా అంటే వారితో ఫొటోలు దిగుతారని.. సొంత పార్టీ కార్యకర్త కారు కింద నలిగిపోయినా పట్టించుకోరని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ గొడ్డలి అంటే జగన్ మోహన్ రెడ్డి ఉలికిపాటుకు గురవుతున్నారన్నారు. గొడ్డలిపోటును గుండెపోటుగా చూపించగలరని దుయ్యబట్టారు. 'నిజాలను ప్రజలకు చెప్పాలి... అవగాహన కల్పించాలి. అందుకే గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం... గొడ్డలి పార్టీ నెవ్వర్ ఎగైన్' అని స్పష్టం చేశారు. ఓ తరానికి ఉపాధి కల్పించేలా చంద్రబాబు అవకాశాలు సృష్టించారని పయ్యావుల కేశవ్ తెలిపారు. జగన్ ఉపాధి అవకాశాలను పోగొడుతున్నారని మండిపడ్డారు. 800 కంపెనీలను గ్రౌండ్ చేయబోతున్నామన్నారు. 'వ్యవస్థల మీద గొడ్డలి పోటు వేశావ్.. పోలవరం మీద గొడ్డలి వేటు వేశావ్.. పరిశ్రమల మీద గొడ్డలి వేటు వేశావ్.. అందుకే మీది గొడ్డలి పార్టీ. అచ్చెన్న అరెస్ట్ నుంచి చంద్రబాబు అరెస్ట్ వరకు భయం సృష్టించే ప్రయత్నం చేశారు. పో÷-లకెయిన్లతో జగన్ విధ్వంసం చేస్తే... నిర్మాణానికి పో÷-లకెయిన్లను వాడుతున్నాం. నేరం జగన్ నైజం.. నేరమయ రాజకీయాలను గతంలో వైఎస్ కుటుంబం మొదలు పెట్టింది.. దాన్ని జగన్ కొనసాగిస్తున్నారు. వివేకాను చంపిందెవరో సునీతమ్మ చెబుతోంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మృతి వెనుక రిలయన్స్ ఉందన్నారు. తిరిగి వారికే రాజ్యసభ పదవి ఇచ్చారు. వైఎస్ మరణం వెనుక జగన్ పాత్ర ఉందని బొత్స అన్నారు. దానికి సమాధానం చెప్పగలరా..? వైఎస్ఆర్‌ను ముద్దాయిగా చేసింది జగనే అని ఉండవల్లి అరుణ్ కుమార్ స్వయంగా చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ముద్దాయిగా చేర్చిన పొన్నవోలుకు పదవి ఇచ్చి గౌరవించారు. పాదయాత్రలో అస్వస్థత గురైనప్పుడు విజయమ్మ వెళ్లారు కానీ... జగన్ వెళ్లలేదు. వైఎస్ మరణం వెనుక ముందుగా విచారించాల్సింది జగన్ మోహన్ రెడ్డినేనని లగడపాటి అన్నారని గుర్తు చేశారు. యువకులు తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని.. ఎవరి చరిత్ర ఏంటో.. యువకులు తెలుసుకోవాలని సూచించారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం చంద్రబాబు పరిశ్రమలు తెస్తున్నారని... జగన్ పరిశ్రమలను తరిమేశారంటూ మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

# చిన్నారుల అంతర్ధానంపై సుప్రీంకోర్టు ఆందోళన

**- కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి**

**- అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం**

దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'విశాల్ వాసిల్య' డేటాబేస్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది. దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లన్నింటినీ అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు , జిల్లా బాలల రక్షణ విభాగాలు చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో షేర్ అవుతుంది. చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని ంఊ÷ుజలను తగిన అధికారాలు, మౌలిక సదుపాయాలతో 4 వారాల్లోగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏదైనా చైల్డ్ మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే.. అధికారులు ప్రాథమికంగా దానిని కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలి. దీనివల్ల ప్రొసీజర్ ఆలస్యం కాకుండా దర్యాప్తులో సీరియస్‌నెస్ వస్తుందని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆ కేసులో హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానాలు ఉంటే.. నిబంధనల ప్రకారం 4 నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును బదిలీ చేయాలని స్పష్టం చేసింది. రక్షించిన లేదా రికవరీ చేసిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలి. ఒకవేళ ఆ నిర్దిష్ట చైల్డ్ ట్రాఫికింగ్ లేదా దోపిడీ వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వస్తే తప్ప, మిగిలిన సమయాల్లో తక్షణమే తల్లిదండ్రుల వద్దకు చేర్చాలి. కుటుంబ సభ్యులపై అనుమానం ఉంటే ఆ బాధ్యతను చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు చూసుకోవాలి. రక్షించిన ప్రతి బిడ్డకు ఒకే గుర్తింపు ఉండేలా చూసుకోవడం, భవిష్యత్తులో వారి ఆచూకీని సులభంగా పర్యవేక్షించడం కోసం అవసరమైన అధికారిక రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లను కోర్టు ఆదేశించింది. తద్వారా ఐడెంటిటీ డూప్లికేషన్‌ను నిరోధించవచ్చని పేర్కొంది. 2011 సెప్టెంబరులో చెన్నైలోని విరుగంబాక్కం పరిధిలో 'కవిత' అనే చిన్నారి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు ఈ కేసును ఆచూకీ లభించనిది గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ ఇచ్చారు. దీనిపై తండ్రి జి. గణెళిష్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. చిన్నారి 2011 లో మిస్ అయింది కావున, 2013 లో వచ్చిన హోం శాఖ యాంటీ-ట్రాఫికింగ్ గైడ్‌లైన్స్ దీనికి వర్తించవని హైకోర్టు పేర్కొంది.

ఈ తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. 'చిన్నారి ఆచూకీ లభించనంత కాలం, చైల్డ్ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్, యాంటీ-ట్రాఫికింగ్ ప్రొటోకాల్స్ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించి, దేశవ్యాప్తంగా ఉన్న మిస్సింగ్ చిన్నారుల సమస్యపై ఈ సమగ్ర ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేసింది. ఆ సమయంలోగా అన్ని రాష్ట్రాలు, అధికారులు దీనిపై నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

## పర్సంటేజీ అయితనే సినిమా ఆడుద్ది

మొదటి పేజీ తరువాయి

హరిహర వీరమల్లు రిలీజ్ సమయంలో.. రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. 'కానీ, సంవత్సరం గడిచిపోయింది. పెద్ది సినిమాకు మాకు పర్సంటేజ్ కావాల్సిందే. మమ్మల్ని నిర్మాతలు రెచ్చగొడుతున్నారు. మొదట మూడు వారాలు అన్నారు.. ఇప్పుడు ఆరు వారాలు అంటున్నారు. పర్సెంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తాము. 120 మంది థియేటర్స్ ఓనర్లు దీనస్థితిలో ఉన్నారు. పర్సంటేజ్ సిస్టంను కావాలనే నిర్మాతలు లేట్ చేస్తున్నారు. మాకు పర్సెంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి. 10,15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి రెవెన్యూ ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్స్‌కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంది'..

పర్సంటేజ్ విధానం కొత్త విషయం కాదు. అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఉంది. కాబట్టి కూర్చుని పర్సంటేజ్‌ను తేల్చండి. అన్ని సినిమాల రిలీజ్ సాఫీగా జరుగుతుంది. మీటింగ్‌లో కూడా పర్సంటేజ్‌కు సైన్ చేస్తేనే పెద్ది రిలీజ్‌కు ఒప్పుకుంటామని చెప్పాము. సబ్ కమిటీలో మెంబర్స్‌గా ఉండి.. మాకు కావలసిన పర్సంటేజ్‌ను సాధించుకుంటాం. మెగాస్టార్ చిరంజీవి పిలిస్తే వెళతాం. పెద్దమనిషికి మా బాధలు చెప్పుకుంటాం. పర్సంటేజ్ సిస్టమే ఉండాలి. రెంటల్ మాట వద్దు' అని అన్నారు.

## వైఎస్ రాజారెడ్డి అరచకాలు అన్నీఇన్నీకావు
## వైఎస్ మరణం ఎలా జరిగిందో అందరికీ తెలుసు

పులివెందులలో వైఎస్ రాజారెడ్డి చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ చెప్పుకొచ్చారు. వైఎస్ ఎలా చనిపోయారో అందరికీ తెలుసునని... ఈ విషయంలో జగన్ సెల్ఫ్ గోల్ వేసుకున్నారని సెటైర్లు గుప్పించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి రాజారెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రౌడీషీట్ ఉందని విమర్శించారు. ఓ కులాన్ని అడ్డం పెట్టుకుని దొంగతనాలు చేయించి డబ్బు గడించిన చరిత్ర రాజారెడ్డిదని ఎద్దేవా చేశారు. శనివారం అమరావతి వేదికగా మీడియాతో ఎంపీ రమేశ్ మాట్లాడారు. ఓ మైన్ ఓనర్‌ను అంతమొందించి రాజారెడ్డి గనులు దక్కించుకుని ధనవంతుడయ్యారని విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాన్ని, మాజీ మంత్రి వివేకారెడ్డి మరణాన్ని జగన్ వేరేలాగా చిత్రీకరిస్తున్నారని ఎంపీ రమేశ్ అన్నారు. వివేకా హత్య కేసులో జగన్ హస్తం ఉందా..?, లేదా..? అనేది ఓపెన్ పోల్ పెట్టాలని సవాల్ చేశారు. ఈ కేసుతో జగన్‌కి సంబంధం లేదని వస్తే తాను రాజకీయాలు వదిలేస్తానని ఛాలెంజ్ చేశారు. ప్రజలకు జగన్ హత్యా రాజకీయాల గురించి తెలిసిపోయిందని.. అందుకే ఆయన ఇప్పుడు తాను మంచివాడిని అని చెబుతున్నారని అన్నారు. వివేకా కేసులో సీబీఐ విచారణ చేసి భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసిందని ప్రస్తావించారు.

## హరీష్ రావువి
# పగటి కలలు

మొదటి పేజీ తరువాయి

అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

## జాతీయ రహదారిపై ఆర్టీసి బస్సు, కారు ఢీ
### ఒక మహిళ మృతి..పలువురికి గాయాలు

ముమ్మిడివరం మండలం అనాతవరం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. 216వ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. రాజోలు నుంచి విశాఖపట్నానికి ఆర్టీసీ బస్సు వెళ్తోంది. కాకినాడ నుంచి మామిడికుదురుకు కారు ప్రయాణిస్తోంది. రెండు వాహనాలు అనాతవరం దగ్గరికి రాగానే ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, ఇతర వాహనదారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. అలాగే ముమ్మిడివరం పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. బాధితులను అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అయితే, చికిత్సపొందుతూ బాధితుల్లో ఓ మహిళ మృతిచెందింది. ప్రమాదంలో గాయపడిన వారి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మరోవైపు ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మరో ఇద్దరికి వెలుగైన హోంగార్డ్ శ్రీనివాస్..!

- కన్నీళ్ల మధ్య నేత్రదానం...
- నివాళులర్పించిన డీసీపీ, ఎసిపి, సీఐలు, హోంగార్డులు
- భార్య చేతుల మీదుగా అంతిమ వీడ్కోలు





**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మే 23:** పోలీస్ డ్రెస్‌లో మూడు దశాబ్దాలపాటు ప్రజా సేవ చేసిన ఓ హోంగార్డ్... చివరికి తన మరణానంతరం కూడా మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపాడు. ఇంటి ముందర విషాదం ముసురుకున్నా, కన్నీరే కళ్లల్లో నిండినా... "అతని చూపు మరో ఇద్దరిలో బతికుండాలి" అన్న కుటుంబ సభ్యుల నిర్ణయం అందరినీ కదిలించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని శ్రీనగర్ కాలనీలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన ప్రతి ఒక్కరి హృదయాన్ని తాకింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్న బుట్టి శ్రీనివాస్ (51) శుక్రవారం రాత్రి అకాల మరణం చెందాడు. ఆ వార్త తెలిసిన క్షణం నుంచి ఇంటి వద్ద విషాదం అలుముకుంది. భార్య జ్యోతి, తల్లి లింగమ్మ గుండెలవిసేలా విలపించారు. తోటి హోంగార్డులు, కాలనీ ప్రజలు, బంధువులు ఇంటి వద్దకు చేరుకుని కన్నీటి నివాళులు అర్పించారు. అలాంటి క్లిష్ట సమయంలో మాజీ కానిస్టేబుల్, సదాశయ ఫౌండేషన్ జిల్లా సలహాదారుడు, మృతుని దగ్గరి బంధువు దేవి లక్ష్మీనర్సయ్య కుటుంబ సభ్యులకు నేత్రదానం గురించి అవగాహన కల్పించారు. "శ్రీనివాస్ చూపు మరో ఇద్దరిలో బతికే ఉంటుంది" అన్న మాట భార్య, తల్లి మనసులను తాకింది. తీవ్ర దుఃఖంలో ఉన్నప్పటికీ వారు గొప్ప మనసుతో నేత్రదానానికి అంగీకరించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు ఆధ్వర్యంలో, ఐ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. మరణానంతరం కూడా ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు నింపిన శ్రీనివాస్‌కు అక్కడున్న ప్రతి ఒక్కరూ నివాళులర్పించారు.

**"మా శ్రీనివాస్ సేవలను ఎప్పటికీ మర్చిపోలేం.."**

శ్రీనివాస్ మృతదేహానికి డీసీపీ రాంరెడ్డి స్వయంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ...1996లో హోంగార్డ్‌గా చేరిన శ్రీనివాస్ గత 30 ఏళ్లుగా నిజాయితీతో, నిబద్ధతతో ప్రజా సేవలో పనిచేశారని గుర్తు చేశారు. ఆయన మరణం పోలీస్ శాఖకు తీరని లోటని అన్నారు. పోలీస్ శాఖ తరఫున కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఏసీపీ రమేష్, సీఐలు ఇంద్రసేనా రెడ్డి, కృష్ణ, హోంగార్డ్ ఆర్ఐ పెద్దన్న, ఎంటీవో మల్లేశం, తోటి హోంగార్డులు కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్ సేవలను స్మరించుకుంటూ గౌరవ వందనం సమర్పించారు.

**భర్తకు భార్యే అగ్గిపట్టిన వేళ...**

ఈ ఘటనలో ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది మాత్రం చివరి ఘట్టం. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త మృతదేహం ముందు జ్యోతి విలపించిన తీరు అక్కడున్నవారి హృదయాలను కదిలించింది. "నన్ను చదివించి లెక్చరర్ చేశాడు... నా జీవితాన్ని నిలబెట్టాడు..." అంటూ ఆమె రోదించిన మాటలు వినగానే చాలామంది కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. శవయాత్రలో భర్తకు అగ్గిపట్టుకొని భార్య జ్యోతి ముందుకు నడిచిన దృశ్యం చూసి కాలనీ ప్రజలు, తోటి హోంగార్డులు మౌనంగా కన్నీరు మున్నీరయ్యారు. జీవితాంతం తోడుగా ఉంటానన్న వ్యక్తికి చివరి వీడ్కోలు ఇస్తూ ఆమె వేసిన ప్రతి అడుగు అక్కడ విషాదాన్ని మరింత గాఢం చేసింది. శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడున్న ప్రతి హృదయం భారంగా మారింది. అయితే తన చూపుతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపిన శ్రీనివాస్ మాత్రం అందరి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

## మల్టీ డిపార్ట్ మెంటల్ సమావేశం

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మే 23:**



సింగరేణి సంస్థ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను విజయవంతంగా సాధించడమే ధ్యేయంగా.. సంస్థ చైర్మన్ ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ ఆదేశాల మేరకు జి.డి.కే సి.యస్.పి ఏరియా వర్క్ షాఫ్, సాయంత్రం ఆర్.సి.ఓ.ఎ క్లబ్ నందు మిగతా అన్ని విభాగాలతో మల్టీ డిపార్ట్ మెంటల్ సమావేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) కి గాను సంస్థ సాధించాల్సిన మైలురాళ్లు, ఎదురవుతున్న సవాళ్లపై అధికారులు, మల్టీ డిపార్ట్ మెంట్ కమిటీ సభ్యులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గనుల పనితీరును, భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. ఉత్పత్తి, ఉత్పాదకత: ఆర్.జి-1 ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి పెంపునకు అనుసరించాల్సిన వ్యూహాత్మక ప్రణాళికలు, రవాణా నిర్వహణ: బొగ్గు ఉత్పత్తికి అనుగుణంగా నెలల వారీగా రవాణా లక్ష్యాలను సజావుగా పూర్తి చేయడం, మార్కెట్ సవాళ్లు: పోటీ మార్కెట్‌లో సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు ఖర్చు నియంత్రణ, నాణ్యతపై దృష్టి, మార్కెట్ సవాళ్లు: ప్రస్తుత మార్కెట్ పోటీని తట్టుకుంటూ సంస్థను లాభాల బాటలో పయనింపజేయడం, కార్మికుల సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడం. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆర్జీ-1 పరిధిలో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను సకాలంలో చేరుకోవడానికి ప్రతి ఒక్క విభాగం సమన్వయంతో పనిచేయాలని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఏ.ఐ.టి.యు.సి గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ఐ.ఇ.డి ఏజీఎం ఆంజనేయులు, ఏరియా ఇంజనీర్ రాంమోహన్, సివిల్ డీజీఎం ఫైడీశ్వర్, ధనలక్ష్మి భాయి ఏరియ వర్క్ షాఫ్ డిజియం జితేందర్ సింగ్, చంద్రశేఖర్, నారయణమూర్తి, రాజ్ కుమార్, హరీష్ మేనేజర్ స్టాటుటరి మేనేజర్ సుదీర్ జక్కుల్ వార్, సీనియర్ పివో శ్రవణ్ కుమార్, అధికారులు రాజన్న, బ్రహ్మాజీ రావు, అశోక్ రావు, సురేష్, జస్వంత్ ఇఇ, ఫిట్ సెక్రటరిలు బండి మల్లేష్, రవిలతో అధిక సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి మండల బిజెపి కన్వీనర్ గా హనుమాద్రి బాలా గౌడ్ను నియమించిన మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్

- మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను చూసే బిజెపి పార్టీలో చేరాను హను మాద్రి బాలా గౌడ్
- నన్ను నమ్మి పార్టీ మండల కన్వీనర్ గా నియమించినందుకు కృతజ్ఞతలు
- బిజెపి పార్టీ మండలంలోని మరింత బలపరిచే విధంగానే తాను కృషి చేస్తాను
- బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తల సహకారంతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్దాం









**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మే 23**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండల బిజెపి పార్టీ కన్వీనర్ గా హనుమాద్రి హనుమాద్రి బాలా గౌడ్ను నర్సాపూర్ బిజెపికార్యాలయంలోని నియమించినట్లు మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాళ్దాస్ మల్లేష్ గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా నూతనంగా వెల్దుర్తి మండల బిజెపి పార్టీ కన్వీనర్ గా ఎన్నికైన హనుమాద్రి బాలా గౌడ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంగా వెల్దుర్తి మండలం బిజెపి పార్టీ కన్వీనర్గానియమించినందున మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్ కు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు అంగడిపేట శ్రీనివాస్ గౌడ్ కు నర్సాపూర్ నియోజకవర్గ మున్సిపల్ వైస్ చైర్మన్ బుక్ చేసి యాదవ్ మురళి యాదవ్ ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని వారు తెలియజేశారు నర్సాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా బిజెపి పార్టీ ప్రజలకు చేస్తున్న అభివృద్ధి పనుల గురించి ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు చేరవేస్తున్నానని వారు అన్నారు గతంలో నిర్వహించిన స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థిని వెల్దుర్తి సర్పంచిగా అత్యధిక మెజార్టీతో గెలిపించడం జరిగిందని ప్రజల్లో బిజెపి పార్టీ అంటే ఏమిటో అని మరోసారి రానున్న ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలలో మళ్లీ బిజెపి పార్టీ అంటే ఏమిటి అనేది చాటి చెపుతామని వారు అన్నారు గతంలో నేను వెల్దుర్తి బిజెపి పార్టీ మండల అధ్యక్షునిగా కూడా పనిచేశానని కొన్ని కారణాల వలన రాజకీయం మానుకోవడం జరిగిందని కేంద్ర ప్రభుత్వం లో ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్నటువంటి అభివృద్ధి పనులను చూసి తాను మళ్ళీ బిజెపి పార్టీలోకి చేరగానే నాకు మండల కన్వీనర్ గా ఇవ్వడం ఎంతో సంతోషకరమని నాపై నమ్మకం ఉంచి నన్ను మండల కన్వీనర్ గా చేసిన పార్టీ అధినేతల సహాయ సహకారాలతో మండల వ్యాప్తంగానే కాదు జిల్లా వ్యాప్తంగా కూడా తాను బిజెపి పార్టీ బలోపేతనానికి కృషి చేస్తానని వెల్దుర్తి మండల బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు అందరం కలిసి బిజెపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రజలకు తెలియజేయాలని ఇప్పటికే దేశంలోనే బిజెపి పరిపాలన నే కోరుకుంటున్నారని రానున్న రోజుల్లో కూడా మళ్లీ మన దేశ ప్రధాని మోడీ అవుతారని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినా తర్వాత పది సంవత్సరాలు బి.ఆర్.ఎస్ పరిపాలన మూడవసారి తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి తెలంగాణ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి హామీలను ఇచ్చి ముఖ్యమంత్రి పదవి పాలన చేస్తున్నారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నెరవేర్చలేని హామీలను ఇచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మరింత మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మనీ ఆయన ఏదైనా చేశారు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు అంగడిపేట శ్రీనివాస్ గౌడ్
వెల్దుర్తి సర్పంచ్ దండెం ఆదర్శ్ పాల్గొన్నారు
8

## కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి అండగా వొడితల ప్రణవ్ -- ఆపదలో ఆదుకున్న నాయకత్వం..



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, మే 23**
కాంగ్రెస్ పార్టీలో ప్రతి కార్యకర్తను తన కుటుంబ సభ్యుడిగా భావిస్తూ, ఆపద సమయంలో అండగా నిలబడే నాయకత్వాన్ని మరోసారి హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ చాటిచెప్పారని జమ్మికుంట కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.
ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కాంగ్రెస్ కార్యకర్త మహమ్మద్ సలీం పాషా కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తూ రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని వొడితల ప్రణవ్ శనివారం జమ్మికుంట కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ద్వారా అందజేశారు. ఈ సహాయాన్ని స్వీకరించిన సలీం పాషా కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, "మాలో ఒకడిగా కలిసిమెలిసి పనిచేసిన సలీం పాషా మరణం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కార్యకర్తలకు కష్టకాలంలో అండగా ఉంటామని చెప్పడమే కాదు, చేతల్లో చూపిస్తూ వొడితల ప్రణవ్ కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచారు. ఆపదలో ఆదుకునే నాయకత్వం అంటే ఇదేనని మరోసారి నిరూపించారు" అని పేర్కొన్నారు.
కార్యకర్తల సంక్షేమం, వారి కుటుంబాల భరోసా విషయంలో ప్రణవ్ ఎల్లప్పుడూ ముందుంటారని, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా నిలబడే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందుతున్నారని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సుంకరి రమేష్, సాయిని రవి, ఎర్రం సతీష్ రెడ్డి, మొలుగూరి సదయ్య, ముద్దమల రవి, లింగంపల్లి లింగారావు, పాత ప్రసాద్, బొంగుని వీరన్న, బండి పవన్, పోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వలసవాదులకు సంపత్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు

- యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లూరి రాహుల్



**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్:**
హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. టీపీసీసీ ఎస్సీ విభాగంలో పదవుల నియామకాల అంశంపై కాంగ్రెస్ నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చల్లూరి రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గురువారం హుజురాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ఎస్సీ విభాగంలో పదవులు కట్టబెట్టారని తిప్పారపు సంపత్ ఆధారాలతో సహా ప్రెస్‌మీట్ నిర్వహించారని తెలిపారు. అయితే ఆ ఆరోపణలకు సమాధానం ఇవ్వకుండా, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వ్యక్తులతో సంపత్‌పై విమర్శలు చేయించడం సిగ్గుచేటని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ ఇటీవల మండల అధ్యక్షుల నియామకాల విషయంలో కనీసం మూడు సంవత్సరాలు పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. కానీ ఆ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు ఇవ్వడం జరిగిందని ఆరోపించారు. తిప్పారపు సంపత్ కాంగ్రెస్ పార్టీ కోసం బీఆర్ఎస్, బీజేపీలతో పోరాడి జైలుకు వెళ్లిన వ్యక్తి అని, శ్రావణ్ అనే వ్యక్తి అధికారం ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లే నాయకుడు కాదని రాహుల్ వ్యాఖ్యానించారు. గత 18 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని, విద్యార్థి ఉద్యమాల నుంచి ఎన్ఎస్‌యూఐ ద్వారా అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు సంపత్ అని కొనియాడారు. శ్రావణ్ కాంగ్రెస్ పార్టీ వ్యక్తి కాదని, టిడిపి నుంచి వచ్చిన వలసవాది మాత్రమేనని ఆరోపించారు. శ్రావణ్‌కు ఇచ్చిన కార్యదర్శి పదవి కూడా పార్టీ నిబంధనలకు వ్యతిరేకమేనని పేర్కొన్నారు. "మీరు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరి మూడు సంవత్సరాలు కాలేదు. అలాంటప్పుడు అసలు కాంగ్రెస్ కోసం పని చేసిన వారిపై మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు" అని మండిపడ్డారు. కవ్వంపల్లి సత్యనారాయణపై తిప్పారపు సంపత్ చేసిన ఆరోపణలు తప్పు అయితే కరీంనగర్ చౌరస్తాలో తాము ముక్కు నేలకు రాస్తామని, అదే ఎమ్మెల్యే తప్పు చేసినట్లు తేలితే ఆయన కూడా అదే విధంగా చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు రావాలని కవ్వంపల్లి, టేకుల శ్రావణ్‌లకు సవాల్ విసిరారు.

## దేశవ్యాప్తంగా భానుడి భగభగలు బయటకు రావాలంటే భయపడతున్న జనాలు

దేశంలో భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి. జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టాలంటే భయంతో వణికిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రానున్న వారం రోజులపాటు కూడా తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని పలు మైదాన ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనావేసింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. విదర్భ, ఆంధ్రాలోని తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ వడగాలులు వీచే అవకాశముందని తెలిపింది. శుక్రవారం ఉదయం దాదాపు 11 గంటల సమయానికి నమోదైన ఉష్ణోగ్రతల ప్రకారం.. ప్రపంచంలోనే 50 అత్యంత వేడి నగరాలన్నీ భారత్‌లోనే ఉన్నాయి. ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ ఈ గణాంకాలను వెల్లడించింది. జాబితాలోని సగం నగరాలు ఉత్తరప్రదేశ్‌లోనివే కావడం గమనార్హం. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలూ ఇందులో ఉన్నాయి.

# ఇటీవల నేరాల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు -- ఇల్లందకుంటలో ఇతర రాష్ట్రాల కూలీలపై ప్రత్యేక నిఘా, ఫింగర్ ప్రింట్ల తనిఖీలు

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట మే 23**
కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలో ఇటీవల వివిధ ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్న నేర సంఘటనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ జమ్మికుంట రూరల్ సి.ఐ., ఇల్లందకుంట ఎస్.ఐ. ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పలు గ్రామాలు, నివాస ప్రాంతాలు, కార్మికులు నివసిస్తున్న ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు.

ఈ తనిఖీలలో భాగంగా వివిధ రాష్ట్రాల నుండి ఉపాధి నిమిత్తం ఇల్లందకుంట మండలానికి వచ్చిన కూలీల వివరాలను సేకరించారు. వారి పేర్లు, స్వగ్రామాలు, గుర్తింపు పత్రాలు, పని చేస్తున్న ప్రాంతాలు వంటి వివరాలను నమోదు చేసి, అవసరమైన చోట ఫింగర్ ప్రింట్లను కూడా పరిశీలించారు. భవిష్యత్తులో ఏదైనా అనుమానాస్పద సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే గుర్తించేలా పోలీసు శాఖ ఆధునిక పద్ధతులతో ముందుకు సాగుతోంది.

ఇటీవల కొన్ని ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, నేరాల పెరుగుదల వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం లక్ష్యం కాదని, కేవలం భద్రతా పరిరక్షణలో భాగంగానే





ఈ చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.

అలాగే ఇతర రాష్ట్రాల నుండి వచ్చే కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులు తప్పనిసరిగా వారి పూర్తి వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు. వారి వద్ద ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాల ప్రతులను భద్రపరచుకోవాలని కూడా సూచించారు. కార్మికుల వివరాలు పోలీసులకు అందించడం ద్వారా నేర నిరోధక చర్యలు మరింత సమర్థవంతంగా అమలవుతాయని పేర్కొన్నారు.

ఇక నేపాల్ దేశానికి చెందిన కొంతమంది వ్యక్తులు కూడా ఉపాధి కోసం ఈ ప్రాంతానికి వస్తున్న నేపథ్యంలో, వారి పూర్తి వివరాలు కూడా నమోదు చేయాలని అధికారులు సూచించారు. వారితో ఎలాంటి అనవసర వివాదాలు లేదా గొడవలు పెట్టుకోకుండా స్థానిక ప్రజలు పరస్పర గౌరవంతో వ్యవహరించాలని సూచించారు.

ప్రజల సహకారం లేకుండా నేర నియంత్రణ పూర్తిస్థాయిలో సాధ్యం కాదని పోలీసులు తెలిపారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వచ్చినా, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు కనిపించినా, అసాధారణ కదలికలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. నేరాలను ముందుగానే అరికట్టడం ద్వారా ప్రశాంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

# “అన్నదానం మహాదానం”.. భగవద్గీత జ్ఞాన మందిరంలో భక్తి వెల్లువ -- శనివారం అన్నదాన సేవలో భారీగా పాల్గొన్న భక్తులు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మే 23**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని భగవద్గీత జ్ఞాన మందిరం లో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమం ఈ వారం కూడా భక్తిశ్రద్ధల నడుమ అత్యంత ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణం భక్తుల రాకపోకలతో కళకళలాడగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేశారు.



ఉదయం నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు, స్వామి దర్శనం అనంతరం అన్నదాన సేవలో భాగస్వాములయ్యారు. భక్తి, సేవా తత్వం, మానవతా విలువలను ప్రతిబింబించే విధంగా అన్నదాన కార్యక్రమం కొనసాగింది. ఆలయ కమిటీ సభ్యులు, సేవా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు సమిష్టిగా ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమం సాఫీగా సాగింది.

అన్నదానం భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన సేవగా భావిస్తారని, ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం గొప్ప పుణ్యకార్యమని పెద్దలు పేర్కొంటారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ భావనతోనే ప్రతి శనివారం భక్తుల సహకారంతో నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు కూడా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తోందని పేర్కొన్నారు. ప్రతి వారం భక్తుల సంఖ్య పెరుగుతుండడం సంతోషకరమని, ఆలయ అభివృద్ధికి కూడా ప్రజలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వారు భోజన వడ్డన, ప్రసాదాల పంపిణీ, భక్తులకు అవసరమైన ఏర్పాట్లలో సహకరించారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తి గీతాలు, ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయి భక్తులను ఆకట్టుకుంది.

ప్రతి శనివారం జరుగుతున్న ఈ సేవా కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మికంగా మరింత చేరువ చేస్తూ, సమాజంలో సేవాభావాన్ని పెంపొందించే దిశగా ముందుకు సాగుతోందని పలువురు అభిప్రాయపడ్డారు. భక్తుల సహకారంతో భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆలయ నిర్వాహకులు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# విలేకరులను బెదిరిస్తే సహించేది లేదు

**– నిజం రాసిన విలేకరిపై దూషణలు చేయడం దుర్మార్గం**
**– రేగొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు**

**కరపత్రం ప్రతినిధి–రేగొండ:**
విలేకరులపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టించడం, బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలకు దిగే నాయకులు తగిన మూల్యం చెల్లించక తప్పదని అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పర్కాల సమ్మయ్య గౌడ్ హెచ్చరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికార మదం, డబ్బు అహంకారంతో కొందరు నిజాలను వెలికితీసే జర్నలిస్టులను అణగదొక్కాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు, అక్రమాలను వెలుగులోకి తెచ్చే విలేకరులను బెదిరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.




అక్రమ మట్టి తరలింపుపై వార్త రాసిన జర్నలిస్టు ఇప్పకాయల సాగర్‌ను రాయపల్లి గ్రామానికి చెందిన అంకం రాజేందర్ దూషించాడని ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టి తరలింపును బయటపెట్టినందుకే ఈ ఘటన చోటుచేసుకుందని పేర్కొన్నారు. ఈ ఘటనపై జర్నలిస్టు ఇప్పకాయల సాగర్ పలువురు జర్నలిస్టు నాయకులతో కలిసి రేగొండ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ, జర్నలిస్టులపై భౌతిక దాడులు, బెదిరింపులు, దూషణలు ఇకపై సహించబోమని స్పష్టం చేశారు. విలేకరుల గొంతు నొక్కే ప్రయత్నాలు చేసిన వారిని ప్రజలే తగిన సమయంలో తీర్పు చెబుతారని హెచ్చరించారు.

జర్నలిజం శక్తి ముందు అహంకారం నిలవదని, నిజం కోసం పనిచేసే విలేకరులను కించపరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని, జర్నలిస్టుల ఐక్యతే ఇటువంటి దాడులకు సరైన సమాధానమని పేర్కొన్నారు.

జిల్లాలో గతంలో కూడా కొందరు విలేకరులను బెదిరించిన ఘటనలు జరిగాయని గుర్తు చేసిన ఆయన, ఇకపై జర్నలిస్టుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. “నిజాన్ని అణగదొక్కే ప్రయత్నాలు ఎప్పటికీ విజయం సాధించవు” అని సమ్మయ్య గౌడ్ పేర్కొన్నారు.

# హామీల అమలు లో ప్రభుత్వం విఫలం..

**– ఈ నెల 30న కరీంనగర్ లో రెండు లక్షల మందితో రాష్ట్ర స్థాయి సమరభేరి**
**– రైతు ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు**

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్:**
రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడం, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా, డిమాండ్ల సాధనకు కరీంనగర్ లో ఈనెల 30న రెండు లక్షల మందితో రాష్ట్ర స్థాయి రైతుల మహా గర్జన సమరభేరి సభను నిర్వహించ తలపెట్టినట్లు రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్య వైఖరిని ప్రశ్నిస్తూ, అన్నదాతల న్యాయమైన డిమాండ్ల సాధనకు పార్టీల కతీతంగా రైతు ప్రజా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ లో నిర్వహించనున్న రైతుల మహాగర్జన సమరభేరి సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. శనివారం వివిధ జిల్లాల రైతు ప్రజా సంఘాల నాయకుల తో రాష్ట్ర నాయకుల తో కలిసి సమరభేరి విజయవంతానికి హైదరాబాద్ లో ఓ హోటల్లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రవాణా, రైతుల సమీకరణ ఏర్పాట్ల పై కో ఆర్డినేటర్ ల తో వారు సమాక్షించారు. ఈ సందర్భంగా పోలాడి రామారావు మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీలను



నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నిర్లక్ష్య వైఖరి వీడి వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పోలాడి డిమాండ్ చేశారు.లేకుంటే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. రెండు లక్షల ఋణ మాఫీ లో సగం మందికే మాఫీ చేసిన ప్రభుత్వం అర్హులైన మిగతా రైతులకు రుణమాఫీ ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. అన్ని పంటలకు 500 రూ బోనస్ ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వడం లేదన్నారు.

పెట్టు బడి సాయం కింద అందించాల్సిన రైతు భరోసా నిధుల విడుదలలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు.ఇప్పటికే రెండు సార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టిన సర్కార్, యాసంగి సీజన్ పూర్తి కావస్తున్నా రైతుల అకౌంట్లలోనేటికీ పూర్తిగా జమ చేయలేదని,పంటల సాగు సమయంలోనే రైతు భరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు బోనస్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న పాల ఉత్పత్తి దారులకు లీటరుకు రూ 4రూపాయల రాయితీ ఎందుకు నిలిపి వేశారని ప్రశ్నల వర్షం కురిపించారు.ఆయా కొనుగోలు కేంద్రంలో దాన్యం నేరుపుతూ కుప్పకూలి రైతులు మృత్యు వాత పడటం, దాన్యం కొనుగోలు చేయడం లేదని నిరసిస్తూ దాన్యాని తగల బెట్టుకోవడం,ఆత్మ హత్యా యత్నినికి పాల్పడటం, తీవ్రంగా కలచి వేసిందని రామారావు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల దాన్యం అధికారుల పర్యవేక్షణ లేక పోవడం తో మిల్లర్లు కింది స్థాయి సిబ్బంది కుమ్మక్కై తేమ, తాలు పేరుతో క్వింటాల్ కు ఏడు నుండి 8 కిలోల వరకు కోత విధిస్తూ రైతులను నిలువుగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై పోరాటమే లక్ష్యంగా ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ డిమాండ్ల సాధనకు ఈ నెల 30 న కరీంనగర్ లో రైతు ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రెండు లక్షల మందితో రాష్ట్ర స్థాయి రైతుల మహా గర్జన సమర భేరి సభను పార్టీల కతీతంగా చారిత్రాత్మకంగా నిర్వహిస్తామని పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా కదలి వచ్చి విజయవంతం చేయాలని పోలాడి పిలుపు నిచ్చారు. ఈ సమావేశం లో రాష్ట్ర నాయకులు రొంటాల కేశవరెడ్డి, బోయినపల్లి శ్రీనివాస్ రావు, తీగల లక్ష్మణ్, విక్రమ్, రవీందర్, శ్రీనివాస్ ల తో పాటు వివిధ జిల్లా ల అధ్యక్షులు, కో ఆర్డినేటర్ లు పాల్గొన్నారు.

# జగన్ కుటుంబ రాజకీయం అందరికీ తెలిసిందే ఇప్పుడేమో అహింసావాదిలా పోజులు కొడుతున్నాడు

**– వారు ఎన్ని హత్యలు చేశారో రాయలసీమ గడపగడపకూ తెలుసు**
**– జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అనగాని సత్యప్రసాద్**

గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొత్తగా తాను చాలా అమాయకుణ్ణి, అహింసావాదిని అంటూ మాట్లాడుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ చురకలు వేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పూర్వీకుల చరిత్ర, ఆయన చరిత్ర ఏంటి అనేది ప్రపంచంలో అందరికీ తెలుసన్నారు. ఎన్ని దారుణాలు చేశారో, ఎన్ని హత్యలు చేశారో రాయలసీమలో ఏ గడపని అడిగినా చెప్తారని అన్నారు. రాజారెడ్డి రాజ్యాంగం గురించి ఎవరిని అడిగినా కథలు కథలుగా చెప్తారని వ్యాఖ్యానించారు. అటువంటి రాజారెడ్డి పోలికలు తనకొచ్చాయని చెప్పుకున్న వ్యక్తి జగన్ అంటూ దుయ్యబట్టారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు చేసిన అరాచకాలు కళ్లారా చూశామని మంత్రి అన్నారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని.. తన వ్యాపారానికి అడ్డుగా ఉన్న ప్రతి ఒక్కరినీ హతమార్చారని జగన్‌పై మంత్రి ఆరోపణలు గుప్పించారు. పరిటాల రవితో సహా ఎంతోమందిని హత్య చేశారన్నారు. అమరనాథ్ గౌడ్, సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం విషయంలో ఏమైందో అందరికీ తెలుసన్నారు. ’తల్లిని తరిమేశాడు.. చెల్లిని ఆస్తి కోసం తరిమేశాడు.. అతని వ్యక్తిత్వం అలాంటిది’ అంటూ వ్యాఖ్యానించారు. బాబాయ్ హత్య కేసుపై సీబీఐ వచ్చి ఎంక్వైరీ చేస్తుంటే.. తన పార్టీ ఎంపీని కాపాడేందుకు సీబీఐ అధికారులపైనే దాడి చేసి తరిమేశారని మండిపడ్డారు. వైఎస్ సునీత ఆవేదన కనిపించటం లేదా అని మంత్రి ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా చేసిన ఐదేళ్లలో బాబాయ్‌ను హత్య చేసిన వ్యక్తిని కనుక్కోలేకపోయారా అని నిలదీశారు.

# వడ్లను కొనుగోలు చేయాలని నేషనల్ హైవే 44 పై రైతులు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి బైఠాయించి నిరసన తెలిపిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి

**– భారీగా మోహరించిన పోలీసులు**






**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మా సాయి పేట మే 23**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో రైతులు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పరిశీలించారు వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్నప్పుడు రైతులు తమ వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని రైతులు వంటేరు ప్రతాపరెడ్డి ముందు ఆవేదన వ్యక్తం చేస్తే రైతులందరితో కలిసి రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మనోహరాబాద్ నేషనల్ హైవే 44 రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలుపుతూ వడ్లను కొనుగోలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు రైతుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయలేని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశారు. రైతులతో పెట్టుకున్న ఈ ప్రభుత్వం కూడా నిలబడలేదని, రైతేడ్చిన రాజ్యం ఎద్దేడ్చిన వివాసం బాగుపడిన దాఖలాలు లేవని అన్నారు రైతులు ఆరుగాలం పండించిన పంటలను కొనుగోలు చేయకుండా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని రైతుల ఉసురు ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి తగులుతుందని అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పట్ల అబద్దాలుమాట్లాడుతున్నారని ఇప్పటికే 80% వడ్లను కొనుగోలు చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం దారుణం అన్నారు వడ్ల కొనుగోలు కేంద్రాలలో 30% వడ్లను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయలేదని తెలిపారు.రైతులు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి తమ వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తమ గోడును ప్రభుత్వానికి నిరసనల ద్వారా చెబుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కనపడటం లేదా అని మండిపడ్డారు

ఇప్పటికైనా రైతులు పండించిన ప్రతి గింజను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు